క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

త్రిపురారం: మండల కేంద్రంలోని విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో 11 కేవీ విద్యుత్ లైన్ మరమ్మతుల కారణంగా సోమవారం ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు త్రిపురారం విద్యుత్ ఏఈ బాలు ఆదివారం తెలిపారు. ఫీడర్ పరిధిలోని ఆయా గ్రామాల గృహ, వాణిజ్య, పరిశ్రమల వినియోగదారులు విద్యుత్ సిబ్బందికి సహకరించాలని కోరారు.

అనుముల శ్రీనివాస్‌రెడ్డికి ఎమ్మెల్యే పరామర్శ



శ్రీనివాస్ రెడ్డిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే జైవీర్ రెడ్డి

త్రిపురారం: మండల కేంద్రానికి చెందిన మాజీ ఎంపీపీ గౌరవ సలహాదారు అనుముల శ్రీనివాస్ రెడ్డి ఇటీవల ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. ఆదివారం నాగార్జున సాగర్ ఎమ్మెల్యే కుందూరు జైవీర్ రెడ్డి త్రిపురారంలోని శ్రీనివాస్ రెడ్డి ఇంటికి వెళ్లి పరామర్శించారు. ఆయన వెంట కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముడిమళ్ల బుచ్చిరెడ్డి, త్రిపురారం పట్టణ అధ్యక్షుడు అనుముల వెంకట్ రెడ్డి, యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు పీబీ రవి, సోషల్ మీడియా కన్వీనర్ జయకృష్ణ, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సభ్యత్వ నమోదును విజయవంతం చేయాలి



సభ్యత్వ నమోదు చేస్తున్న వర్షిత్ రెడ్డి

చింతపల్లి: బీజేపీ సభ్యత్వ నమోదును విజయవంతం చేయాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు వర్షిత్ రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం చింతపల్లి మండల పరిధిలోని మాల్ వెంకటేశ్వర్ నగర్‌లో నిర్వహించిన సభ్యత్వ నమోదులో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి చెనమోని రాములు, మండల అధ్యక్షుడు రమేష్ యాదవ్, మండల ప్రధాన కార్యదర్శి బొడ్డు మహేష్, మండల ఉపాధ్యక్షులు గొట్టి పర్వతాలు, కనిగిరి గోవర్ధన్, సందుపట్ల రాజేష్, గుర్రం వెంకటరమణ, బీజేవైఎం మండల ప్రధాన కార్యదర్శి గజ్జి అభినవ్ గౌడ్, పాలగోని బాల్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రీయ దృక్పథానికి 'చెకుముకి' దోహదం



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న డీఎస్పీ

మిర్యాలగూడ అర్బన్: విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం పెంచడానికి చెకుముకి టెస్టులు దోహదం చేస్తాయని డీఎస్పీ రాజశేఖర రాజు తెలిపారు. జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహించనున్న చెకుముకి సంబురాల వాల్ పోస్టర్‌ను ఆదివారం ఆయన స్థానికంగా ఆవిష్కరించి మాట్లాడారు. విద్యార్థుల్లో సైన్స్‌పట్ల ఆసక్తిని కలిగించడానికి, సైన్స్‌లో ప్రావీణ్యతను పెంచడానికి, సృజనాత్మక శక్తిని ప్రోత్సహించడానికి, శాస్త్రీయ దృక్పథాన్ని, శాస్త్రవేత్తలుగా ఎదగడానికి తోడ్పడే విధంగా జన విజ్ఞాన వేదిక చేస్తున్న కృషిని అభినందించారు. కార్యక్రమంలో వేదిక జిల్లా అధ్యక్షుడు గుత్తికొండ సుదర్శన్‌రెడ్డి, నాకులు కోలా శ్రీనివాస్, రమణారెడ్డి, బక్కా శ్రీనివాసచారి, మోర్తాల శ్రీనివాస రెడ్డి, కృష్ణయ్య, రాజశేఖర రెడ్డి, ఉస్మాన్ అలీ, దయాకర్‌రెడ్డి, మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

రెండు లక్షల విత్తనాల సేకరణ



విత్తనాలు సేకరిస్తున్న యువకులు

మిర్యాలగూడ టౌన్: పట్టణంలోని గాంధీనగర్‌కు చెందిన యువకులు పర్యావరణ పరిరక్షణకు వనజీవి రామయ్య స్ఫూర్తితో ఆదివారంతో రెండు లక్షల విత్తనాలు సేకరించారు. ఇప్పటికే లక్ష విత్తనాలు వివిధ ప్రాంతాల్లో చల్లగా.. మరో లక్ష విత్తనాల వరకు సేకరించారు. ఈ సందర్భంగా గాంధీనగర్‌కు చెందిన అవిరెండ్ల సందీప్‌కుమార్, దైద శ్రీనివాస్ మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని విశాఖపట్నంకు చెందిన పర్యావరణ వేత్త, గ్రీన్ క్రియేట్ ఎన్జీఓ జీవి రత్నం ద్వారా విశాఖపట్నంలోని నేవీ హెలికాప్టర్ ద్వారా సీడ్స్ బాల్స్ వేసేందుకు విత్తనాలను పంపిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఎస్కె రషీద్, కత్తుల అవినాష్, కందికంటి రాజా, కందికంటి ప్రశాంత్, కొత్తపల్లి మణి తదితరులున్నారు.

రోడ్లపైనే చెత్త

- మిర్యాలగూడ మున్సిపాలిటీలో ఎక్కడపడితే అక్కడ దర్శనమిస్తున్న చెత్తకుప్పలు
- దుర్వాసనతో కాలనీవాసుల ఇబ్బందులు

మిర్యాలగూడ టౌన్: మున్సిపాలిటీ పరిధిలోని ఈదులగూడెం, రాంనగర్ బంధం, హౌజింగ్ బోర్డు, రెడ్డికాలనీ, విద్యానగర్, తడకమళ్ల రోడ్డు తాళ్లగడ్డ, షాబునగర్, శాంతినగర్, నందిపాడు బైపాస్, బంగారుగడ్డ, హనుమాన్‌పేట తదితర ప్రాంతాల్లో ఎక్కడపడితే అక్కడ చెత్త కుప్పలు దర్శనం ఇస్తున్నాయి. కొంతమంది చిరు వ్యాపారులు, మరికొంత మంది స్థానికులు చెత్త సేకరణ చేసే ఆటోలు, ట్రాక్టర్లలో వేయకుండా రోడ్లపైనే పడేస్తున్నారు. పలు కాలనీల్లో గత కొంత కాలంగా చెత్తను తరలించకపోవడంతో చెత్త పేరుకుపోతోంది. దీంతో స్థానికులు దుర్వాసనతో ఇబ్బందులకు గురవుతున్నారు. కాలనీ వాసులు, మాంసం, చికెన్ దుకాణాదారులు, చిరు వ్యాపారులు ఎక్కడపడితే అక్కడ చెత్త వేయకుండా మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకోవాలని ఆయా కాలనీవాసులు పేర్కొంటున్నారు.



మిర్యాలగూడ పట్టణంలోని ఈదులగూడెం ట్యాంకు సమీపంలో పేరుకుపోయిన చెత్త



మిర్యాలగూడ పట్టణంలోని సుందర్‌నగర్‌లో చెత్త కుప్ప

ఇళ్ల మధ్యలోనే చెత్త పేరుకుపోతోంది

వివిధ ప్రాంతాల నుంచి తీసుకువచ్చిన చెత్తను ఇక్కడే పడేసి వెళ్తున్నారు. ఇలా ఇళ్ల మధ్య చెత్త పేరుకుపోవడంతో దుర్వాసన వస్తోంది. దీంతో ఇళ్లలో ఉండలేని దుస్థితి నెలకొంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించాలి. – జ్యోతి, మిర్యాలగూడ

రోడ్లపై చెత్త వేస్తే జరిమానా విధిస్తాం



మున్సిపాలిటీలో ఎక్కడపడితే అక్కడ చెత్త వేయకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటాం. రోడ్లపై చెత్త వేసేవారిని గుర్తించి జరిమానా విధించే విధంగా చర్యలు చేపడతాం. చెత్తను కాలనీలోకి వచ్చే చెత్త సేకరణ వాహనాల్లోనే వేయాలి.

– మహ్మద్ యూసుఫ్, మున్సిపల్ కమిషనర్, మిర్యాలగూడ

నిత్య భిక్ష ఏర్పాటు అభినందనీయం

- ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి



హాలియాలో మాలధారులకు భిక్ష ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి

హాలియా : కార్తీక మాసం సందర్భంగా మాలధారణ చేసిన స్వాములకు దాతల సాయంతో నిత్య భిక్ష ఏర్పాటు చేయడం అభినందనీయమని ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి అన్నారు. అఖిల భారత అయ్యప్ప సేవా సంఘం, హనుమాన్ శక్తి జాగరణ సమితి ఆధ్వర్యంలో ఆదివారం హాలియా పట్టణంలోని సీతారామచంద్ర, హనుమాన్ ఆలయ ప్రాంగణాల్లో ఆంజనేయ, అయ్యప్ప, శివ, దత్తాత్రేయ స్వాములకు ఏర్పాటు చేసిన భిక్ష కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఉద్యోగాలు, వ్యాపారాలు, ఇతర పనులపై బయట తిరిగే మాలధారులు సీతారామ చంద్రస్వామి ఆలయం వద్ద భిక్ష స్వీకరించవచ్చని తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే జయవీర్‌రెడ్డి ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి భిక్షను స్వీకరించారు. కార్యక్రమంలో గురుస్వామి మోహన్‌రావు పాల్గొన్నారు.

జానారెడ్డికి సన్మానం



జానారెడ్డిని సన్మానిస్తున్న కమిటీ సభ్యులు

నాగార్జునసాగర్: నందికొండలోని నాగార్జునసాగర్ ఎర్త్ డ్యాం దిగువ గల ముత్యాలమ్మ కాళికాదేవి ఆలయ నూతన కమిటీ ఎన్నికైంది. ఈ సందర్భంగా ఆదివారం నాగార్జునసాగర్‌కు వచ్చిన సీఎల్పీ మాజీ నేత కుందూరు జానారెడ్డిని కమిటీ సభ్యులు ఆయన నివాసంలో కలిసి సన్మానించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు మంజుల జనార్దన్, ప్రధాన కార్యదర్శి మంద రఘువీర్, శ్రీనివాస్, సాగర్‌రెడ్డి, శివ, వెంకటేశ్వర్లు, కృష్ణ, సైదిరెడ్డి, పరమేష్, అప్పారావు, తుర్గయ్య, శ్రీనివాసచారి, రమేష్, సత్యనారాయణ తదితరులున్నారు.

పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గించాలి



సమావేశంలో మాట్లాడుతున్న సుధాకర్‌రెడ్డి

దేవరకొండ: ప్రపంచ మార్కెట్లో క్రూడాయిల్ ధరలు తగ్గుతున్నా దేశంలో మాత్రం పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు తగ్గించడం లేదని సీపీఎం జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి అన్నారు. ఆదివారం దేవరకొండలో నిర్వహించిన సీపీఎం మండల సమావేశంలో ఆయన మాట్లాడారు. పెరుగుతున్న ధరలతో ప్రజలపై ఆర్థిక భారం పడుతోందన్నారు. కేంద్రంలో మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్ శక్తులకు ధారాదత్తం చేస్తోందని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో రాష్ట్ర కమిటీ సభ్యులు నారి ఐలయ్య, నల్ల వెంకటయ్య, బిజిలి లింగయ్య, బుడిగ వెంకటేష్, రహీం, శ్రీనివాస్, తదితరులున్నారు.

హామీలు అమలు చేయని కాంగ్రెస్ ప్రభుత్వం



మాడ్గులపల్లి పీఏసీఎస్ కేంద్రంలో ధాన్యాన్ని పరిశీలిస్తున్న గోలి మధుసూదన్‌రెడ్డి

వేములపల్లి(మాడ్గులపల్లి): ఎన్నికల సమయంలో రైతులకు అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం వాటిని అమలు చేయకుండా మోసం చేస్తోందని బీజేపీ జాతీయ నాయకుడు గోలి మధుసూదన్‌రెడ్డి ఆరోపించారు. ఆదివారం మాడ్గులపల్లి మండల కేంద్రంలోని పీఏసీఎస్ కొనుగోలు కేంద్రాన్ని ఆయన పరిశీలించి మాట్లాడారు. ప్రతి రైతుకు రూ.15వేల రైతు భరోసా అందిస్తామని చెప్పి ఇప్పటివరకు అందించలేదన్నారు. పూర్తిస్థాయిలో రుణమాఫీ కూడా చేయలేదన్నారు. అనంతరం మండల కేంద్రంలో బీజేపీ సభ్యత్వ నమోదు చేపట్టారు. కార్యక్రమంలో కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు గడ్డం వెంకటరెడ్డి, నాయకులు గుండా నవీన్‌రెడ్డి, సాయన్న, బండారు ప్రసాద్, సత్యనారాయణ, రమణ, బొమ్మకంటి నరసింహ, జాన్‌రెడ్డి, గురుస్వామి, వేణు, రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యల పరిష్కారానికి కృషి



దేవరకొండ: విద్యుత్ వినియోగదారుల నుంచి వినతిపత్రాలు స్వీకరిస్తున్న డీఈ, ఏడీఈ



మిర్యాలగూడ అర్బన్: వినతిపత్రం అందజేస్తున్న విద్యుత్ వినియోగదారులు



హాలియా: విద్యుత్ సమస్యలపై దరఖాస్తు అందజేస్తున్న కౌన్సిలర్ వర్ర వెంకట్‌రెడ్డి

దేవరకొండ: విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారానికి సంబంధిత అధికారులు కృషి చేస్తున్నట్లు డీఈ విద్యాసాగర్ తెలిపారు. ఆదివారం దేవరకొండలోని విద్యుత్ కార్యాలయంలో విద్యుత్ వినియోగదారుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు తమ వ్యవసాయ బావులు, ఇళ్ల వద్ద విద్యుత్ ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కాగా.. విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని 14మంది వినియోగదారులు అధికారులకు విన్నవించారు. కార్యక్రమంలో ఏడీఈ సైదులు, ఏఏఈ, ఏఈలు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే వినియోదారుల వేదిక

మిర్యాలగూడ అర్బన్: విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారం కోసమే విద్యుత్ వినియోగదారుల వేదిక ఏర్పాటు చేసినట్లు ట్రాన్స్‌కో డీఈ శ్రీనివాస సుధీర్‌కుమార్ అన్నారు. ఆదివారం స్థానిక ట్రాన్స్‌కో డీఈ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విద్యుత్ వినియోదారుల సమస్యల పరిష్కార వేదికలో ఆయన మాట్లాడారు. డివిజన్ వ్యాప్తంగా విద్యుత్ వినియోగదారులు తమ సమస్యలపై విన్నవించేందుకు పరిష్కార వేదిక మంచి అవకాశమని తెలిపారు. త్రిపురారం, మిర్యాలగూడ రూరల్, వేములపల్లి మండలాల నుంచి ఒక్కో సమస్య తమ దృష్టికి రాగా దామరచర్ల మండలం, మిర్యాలగూడ పట్టణం నుంచి రెండేసి సమస్యలపై వినియోదారులు వినతిపత్రాలు అందించారని చెప్పారు. వాటిలో ఐదు సమస్యలను పరిష్కరించేందుకు సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశామని తెలిపారు. మిగిలిన సమస్యలను త్వరలోనే పరిష్కరించి విద్యుత్ వినియోగదారులకు సేవలందిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ట్రాన్స్‌కో అధికారులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారమే లక్ష్యం

హాలియా: విద్యుత్ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పని చేస్తున్నట్లు హాలియా ఏడీఈ తిరుపతయ్య తెలిపారు. ఆదివారం విద్యుత్ వినియోగదారుల దినోత్సవం సందర్భంగా హాలియాలోని సబ్ డివిజన్ కార్యాలయ ఆవరణలో విద్యుత్ వినియోగదారుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. హాలియా మున్సిపల్ కౌన్సిలర్ వర్ర వెంకట్‌రెడ్డి పట్టణంలోని 11వ వార్డులోని వీరయ్య నగర్, అంగడి బజార్, రామచంద్రనగర్, జానారెడ్డి నగర్ నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని అధికారులకు దరఖాస్తు అందజేశారు. కార్యక్రమంలో విద్యుత్ ఏఈ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

భారీ వర్షం.. నేలకొరిగిన వరి చేలు



పెద్దఅడిశర్లపల్లి మండల కేంద్రంలో నీట మునిగిన వరి చేను

గుర్రంపోడు: మండలంలో శనివారం రాత్రి కురిసిన వర్షానికి కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం తడిసింది. చామలేడు, కొప్పోలు, కోయగూరవారిబావి కొనుగోలు కేంద్రాల్లో రైతులు ఆరబోసిన ధాన్యం కొట్టుకుపోయింది. చామలేడు కేంద్రంలో 200 క్వింటాళ్ల ధాన్యం తడిసిందని మండల వ్యవసాయాధికారి మాధవరెడ్డి తెలిపారు. కోయగూరవారిబావి కేంద్రంలో రైతులు ఆరబోసిన ధాన్యం తడిసిందని, ఆరిన తర్వాత తేమశాతం రాగానే కొనుగోలు చేస్తామని ఐకేపీ ఏపీఎం యాదయ్య తెలిపారు.

కొండమల్లేపల్లి: కొండమల్లేపల్లి మండల కేంద్రంలో ఆదివారం తెల్లవారుజామున కురిసిన భారీ వర్షానికి వరిచేలు నేలకొరిగాయి. పత్తి తడిసిపోయింది.

పీఏపల్లి మండలంలో భారీ వర్షం

పెద్దఅడిశర్లపల్లి: పెద్దఅడిశర్లపల్లి మండలంలో ఆదివారం తెల్లవారుజామున భారీ వర్షం కురిసింది. పంట పొలాలు నీట మునగడంతోపాటు పలు గ్రామాల రోడ్లు ధ్వంసమయ్యాయి. పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు కోరారు.



కొండమల్లేపల్లిలో వర్షానికి తడిసిన పత్తి

ఆర్థిక చేయూత



ఫిక్స్‌డ్ డిపాజిట్ పత్రాలు అందజేస్తున్న స్నేహితులు

మిర్యాలగూడ: పట్టణంలోని శాంతినగర్‌కు చెందిన పోగుల సైదులు ఇటీవల మృతిచెందాడు. విషయం తెలుసుకున్న అతడి చిన్ననాటి స్నేహితులు ఆదివారం కుటుంబసభ్యులను పరామర్శించారు. సైదులు కుమార్తె పేరుపై రూ.4లక్షలను ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసి ఆ పత్రాలను కుటుంబసభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో ఉదయ్‌భాస్కర్, రవికిరణ్, రఘు, రామకృష్ణ, నగేష్, రవి, నరసింహాచారి, ఏడుకొండలు, రామారావు, జనార్దన్, నాగేందర్, చంద్రశేఖర్, రాజేష్ పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత



ఆర్థికసాయం అందజేస్తున్న ఫాండేషన్ సభ్యులు

డిండి: మండల పరిధిలోని రహమంతాపూర్ గ్రామానికి చెందిన ఎలిమినేటి కార్తీక్, ఎలిమినేటి రాకేష్, ఎలిమినేటి యాదగిరి ఇటీవల డిండి మండలంలోని కుందుకూర్ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. వీరికి మెరుగైన చికిత్స నిమిత్తం 'మన రహమంతాపూర్ ఫౌండేషన్' ఆధ్వర్యంలో ఆదివారం రూ.80 వేల ఆర్థికసాయాన్ని అందజేశారు.

దళితులను మోసం చేసిన సీఎం రేవంత్



మాట్లాడుతున్న ఎంఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ మచ్చ ఏడుకొండలు

మిర్యాలగూడ టౌన్: ఎస్సీ వర్గీకరణ అమలులో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దళితులను మోసం చేశారని మహా సంఘర్షణ సమితి అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ మచ్చ ఏడుకొండలు అన్నారు. ఆదివారం మిర్యాలగూడలోని సంఘం కార్యాలయంలో ఎమ్మార్పీఎస్ జిల్లా కార్యదర్శి సంద్ర నాగరాజు మాదిగ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆయా రాష్ట్రాలు వర్గీకరణను అమలు చేయాల్సిందిగా సుప్రీం కోర్టు తీర్పు నిచ్చిందని, ఈ తీర్పును తాము స్వాగతిస్తున్నామంటూ అసెంబ్లీ సాక్షిగా ప్రకటించిన సీఎం రేవంత్‌రెడ్డి ఇప్పటి వరకు అమలు చేయకుండా మాదిగలు, మాదిగ ఉప కులాలను మోసం చేశారని ఆరోపించారు. ఈ నెల 4న నల్లగొండలో నిర్వహించే మాదిగల సన్నాహక సదస్సుకు భారీగా తరలిరావాలన్నారు. సమావేశంలో ఎంఎస్పీ జిల్లా అధికార ప్రతినిధి మార్పు శ్రీనివాస్, నాయకులు చింత మధు, ముడుపు శ్రీనివాస్, గంధం సాల్మన్, మోహన్, సూరయ్య తదితరులున్నారు.

బౌద్ధమ దేవాలయాల్లో సబ్ కలెక్టర్ పూజలు



ఆలయంలో పూజలు చేస్తున్న సబ్ కలెక్టర్ అమిత్‌నారాయణ్

అడవిదేవులపల్లి: మండల శివారులోగల కృష్ణానది తీరాన ఉన్న బౌద్ధమ దేవాలయాలను సబ్ కలెక్టర్ అమిత్‌నారాయణ్ ఆదివారం సందర్శించారు. పార్వతీ పరమేశ్వరస్వామి, చెన్నకేశవస్వామి, సూర్యనారాయణస్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు యడవెల్లి రఘురామశర్మ, అనంతకృష్ణశర్మలు ఆయనను సన్మానించారు. కార్తీకమాసంలో కృష్ణానది ఒడ్డున భక్తులు పూజలు నిర్వహిస్తారని, వారికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఆయన వెంట తహసీల్దార్లు సురేష్‌కుమార్, హరిబాబు, జవహర్‌లాల్, ఆర్ఐ రామకృష్ణ తదితరులున్నారు.

నేడు ధర్మయుద్ధ సదస్సు

నల్లగొండ టౌన్: జిల్లా కేంద్రంలో సోమవారం నిర్వహించనున్న మాదిగల ధర్మయుద్ధ సదస్సుకు మాదిగలు భారీగా తరలివచ్చి జయప్రదం చేయాలని ఎంఎస్పీ జిల్లా అధ్యక్షుడు బకరం శ్రీనివాస్, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు ఇరిగి సైదులు, మాదిగ ఉద్యోగుల సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మల్లెపాక వెంకన్న పిలుపునిచ్చారు. ఆదివారం స్థానికంగా జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. సదస్సుకు ముఖ్య అతిథిగా ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ హాజరుకానున్నారని పేర్కొన్నారు. సమావేశంలో మామిడి సైదులు, లంకపల్లి నగేష్, కొమిరె స్వామి, జిల్లా నర్సింహ, బొజ్జ దేవయ్య, మాసారం వెంకన్న, బొజ్జ నాగరాజు పాల్గొన్నారు.

నిత్యాన్నదానం ఆదర్శనీయం

త్రిపురారం: కార్తీక మాసోత్సవం సందర్భంగా మాలధారులకు నిత్యాన్నదానం చేయడం ఆదర్శనీయమని త్రిపురారం మాజీ సర్పంచ్ అనుముల శ్రీనివాస్ రెడ్డి అన్నారు. త్రిపురారం మండల కేంద్రంలోని శ్రీ సాయిబాబా ఆశ్రమంలో ఆదివారం దాతల సహకారంతో ఏర్పాటు చేసిన నిత్యాన్నదాన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో అనుముల సుధాకర్ రెడ్డి, చెంచల రాంబాబు, పాండు గురుస్వామి తదితరులు పాల్గొన్నారు.

అల్లుకున్న నిర్లక్ష్యం

పెద్దవూర: మండల కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ సమీపంలో, జడ్చర్ల–కోదాడ జాతీయ రహదారి వెంట ఉన్న విద్యుత్ స్తంభాలకు తీగలు జాతి మొక్కలు అల్లుకున్నాయి. నిత్యం అధికారులు, ప్రజాప్రతినిధులు ఈ రహదారి వెంట వెళ్తున్నా కనీసం పట్టించుకోవడం లేదు. పలు గ్రామాల్లో ట్రాన్స్‌ఫార్మర్‌లను సైతం తీగజాతి మొక్కలు కమ్మేశాయి. ట్రాన్స్‌ఫార్మర్ ఫ్యూజ్ కొట్టేసినప్పుడు, ఏదైనా అత్యవసర పరిస్థితుల్లో కరెంట్‌ను ఆఫ్ చేయాలంటే ఇబ్బందిగా మారుతోంది. విద్యుత్ స్తంభాల వద్ద ఏపుగా పెరిగిన చెట్లతో ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందో తెలియని పరిస్థితులు నెలకొన్నాయి. అధికారులు స్పందించి విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఏపుగా పెరిగిన చెట్లు, తీగజాతి మొక్కలను తొలగించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



పెద్దవూరలో జడ్చర్ల- కోదాడ జాతీయ రహదారిపై విద్యుత్ స్తంభాలకు అల్లుకున్న తీగ



గర్నెకుంట రహదారి వెంట..



పెద్దవూర సబ్‌స్టేషన్ సమీపంలో